ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు
శనివారం 10 మే 2025



మీ రుణం తీర్చుకుంటా



గడువులోగా హంద్రీనీవా పూర్తి చేయాలి

అభివృద్ధిలో అనంతను మూడో స్థానానికి చేర్చాలి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

ఛాయాపురంలో లైడెనింగ్ పనుల పరిశీలన

మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టును పునరుద్ధరిస్తాం



బంగారు కుటుంబంతో సీఎం చంద్రబాబు, వేదికపై మంత్రి కేశవ్, అధికారులు

గుంతకల్లు/ఉరవకొండ, మే9(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఉమ్మడి జిల్లా టీడీపీకి ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందని, మీ రుణాన్ని తీర్చుకుంటానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. హంద్రీనీవా లైడెనింగ్ పనులను పరిశీలించడానికి వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామానికి ముఖ్యమంత్రి శుక్రవారం వచ్చారు. గ్రామంలో ప్రజావేదికను నిర్వహించారు. తొలుత పాకిస్థాన్‌తో యుద్ధంలో అసువులు బాసిన సైనికుడు మురళీనాయక్‌కు నివాళులర్పించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ దేశాన్ని కాపాడగలిగే నేత నరేంద్రమోదీ అని తాను అమరావతి సభలో వ్యాఖ్యానించానని, పాక్‌తో యుద్ధంలో ఆయన సాధిస్తున్న విజయాలు అందుకు నిదర్శనమన్నారు. అభివృద్ధిలో అనంతపురం జిల్లా ప్రస్తుతం 13వ స్థానంలో ఉందని, 3వ స్థానానికి చేర్చడమే లక్ష్యంగా పని చేయాలని అధికారులను ఆదేశించారు.

జిల్లాకు వరాలు..

ప్రజావేదిక సాక్షిగా సీఎం చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లాకు వరాల జల్లు కురిపించారు. ఉరవకొండకు టెక్స్‌టైల్ పార్కు మంజూరు చేస్తామని, అయితే కంపెనీలను తీసుకువచ్చే బాధ్యత మంత్రి కేశవ్‌దేనని సీఎం చమత్కరించారు. పొట్టిపాడుకు దగ్గర బ్రిడ్జి నిర్మాణానికి నిధులు, కొట్టాలపల్లి లిఫ్ట్ ఇరిగేషన్‌ను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జీడీపల్లి నిర్వాసితులకు వెంటనే పరిహారం అందిస్తామన్నారు. 50 వేల ఎకరాల మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టును పునరుద్ధరిస్తామన్నారు. జీడీపల్లి, భైరవాని తిప్ప, పేరూరు సహా ప్రాజెక్టులన్నింటికీ ప్రాధాన్యం ఇస్తామన్నారు.

పంచాయతీ కార్యదర్శికి మందలింపు

ప్రజావేదికలో ఛాయాపురం విలేజ్ ఎకనామిక్ ప్రొఫైల్‌ను చదివిన పంచాయతీ కార్యదర్శి రామయ్యను ముఖ్యమంత్రి ప్రశంసిస్తూనే, సమగ్ర పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేసినందుకు మందలించారు. ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించే పని చేపట్టనందుకు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంత నిర్లక్ష్యమైతే ఎలా అన్ని ప్రశ్నించారు. ఇకపై ఇలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బంగారు కుటుంబాలను ఆదుకుంటాం

ఎంపికైన బంగారు కుటుంబాలన్నింటినీ అన్నివిధాలుగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ప్రజావేదికలో బంగారు కుటుంబాలకు ఎంపికైన వారితో ముఖ్యమంత్రి చర్చించారు. ఛాయాపురంలో బంగారు కుటుంబం కింద ఎంపికైన పార్వతితో చంద్రబాబు ముఖాముఖి మాట్లాడారు. పార్వతి భర్త బేల్దారి పనులు చేస్తూ కరెంటు షాక్‌కు గురై కిందపడి పనిచేయలేని పరిస్థితికి చేరుకున్నాడు. దీంతో నలుగులు పిల్లలను, భర్తను పోషిస్తున్న పార్వతి తన కష్టాలు సీఎంకు

(మిగతా 6వ పేజీలో...)



వృథా కాదు నీ మరణం

సిందూరం రాలిన
మంచు కొండల దిగువన
శివతాండవమాడిన
తండా వీరుడా..!

ఆ అర్ధరాత్రి..
దేశమాత ఒడిలో ఒరిగిపోతూ..
అమ్మ.. నాన్న గురించి..
ఆందోళన చెందావటగా..!

అమ్మ కడుపున పుట్టింది..
నువ్వొక్కడివే కావచ్చుగాని..
భారతమ్మ కడుపున..
కోటాను కోట్లుగా
కలిసే పుట్టాంగదా..!

పసితనంలో నువ్వెక్కింది..
నాన్న భుజంపై మాత్రమేకావచ్చు..!
ఇప్పుడు చూడు..
నిన్ను మోసేందుకు
ఎన్నెన్ని భుజాలు
పోటీ పడుతున్నాయో..!
ఇక దిగులెందుకు..?

నువ్వు మెలేసిన సీమ మీసం..
సరిహద్దుల్లో వీర ఖడ్గమై..
నిటారుగా నిలబడే ఉంది..!

నీ జ్ఞాపకాలు
కాశ్మీర తీరాల నుంచి
కన్యాకుమారి అంచు వరకూ
గాలి తెమ్మెరలై వీస్తూనే ఉంటాయి
మువ్వన్నెల జెండాను..
రెపరెపలాడిస్తూనే ఉంటాయి..!
వృథా కాదు నీ మరణం..!



అగ్ని వీరుడై.. శతఘ్ని శూరుడై..



శత్రుమూకలను చెండాడి..
భరతమాత ముద్దుబిడ్డ వీరమరణం
రణభూమిలో ఒరిగిన జవాను మురళీనాయక్
ఊరూరా నివాళులు..
కొవ్వొత్తుల ర్యాలీలు.. 6

టీచర్ల బదిలీలకు సన్నద్ధం 6

జిల్లాను టాప్-3లో నిలపాలి: సీఎం

ఇంటర్ సప్లీలు సజావుగా నిర్వహించాలి

● డీఆర్వో విజయసారథి



అధికారులతో మాట్లాడుతున్న డీఆర్వో విజయసారథి

కొత్తచెరువు, మే 9(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించాలని డీఆర్వో విజయసారథి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో శుక్రవారం ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ.. పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పొరబాట్లకు తావివ్వద్దన్నారు. డీఐఈఓ సయ్యద్ మౌలా మాటాడుతూ... ఈనెల 12వ తేదీ నుంచి నిర్వహించే పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టామన్నారు. జిల్లాలో ఉదయం 36, మధ్యాహ్నం 22 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రశ్నపత్రాలను 20 పోలీసు స్టేషన్లలో భద్రపరిచామన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్లు తదితర సదుపాయాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయ్‌కుమార్, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, కార్మిక శాఖాధికారి సూర్యనారాయణ, విద్యాశాఖ అధికారి లింగన్న పాల్గొన్నారు.

పాఠశాలల లాగిన్‌లో టెన్త్ షార్ట్ మెమోలు

కొత్తచెరువు, మే 9(ఆంధ్రజ్యోతి): పాఠశాలల హెచ్‌ఎంల లాగిన్‌లో పదో తరగతి పాసైన విద్యార్థుల మార్కుల జాబితా(షార్ట్ మెమో)లు పొందవచ్చని డీఈఓ కిష్టప్ప శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రతి విద్యార్థి షార్ట్ మెమో సరిచూసుకోవాలన్నారు. మార్కులు, పేరు తదితర తప్పిదాలు ఉంటే హెచ్‌ఎంకి ఆధారాలతో అందజేయాలని డీఈఓ సూచించారు.

శేషవాహనంపై ఊరేగిన శ్రీవారు

నేడు చెన్నకేశవుడి రథోత్సవం

ధర్మవరం, మే 9(ఆంధ్రజ్యోతి): చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన శుక్రవారం పట్టణ పురవీధుల్లో ఉదయం చెన్నకేశవస్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. సాయంత్రం శేషవాహనంపై, రాత్రి గజ వాహనంపై ఊరేగించారు. అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పొరాళ్లపుల్లయ్య శిష్యబృందం అన్నమయ్య సంకీర్తనలను ఆలపించింది. కార్యక్రమంలో ఆలయ అడహక్ కమిటీ చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్, ఈఓ వెంకటేశ్వర్లు, అర్చకులు కోనేరాచార్యులు, భానుప్రకాశ్, పాల్గొన్నారు. శనివారం ఉదయం మడుగుతేరు, సాయంత్రం 5గంటలకు రథోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు.

హాజరుకానున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం పట్టణంలో శనివారం ఉదయం నిర్వహించే చెన్నకేశవస్వామి రథోత్సవానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరవుతున్నట్లు టీడీపీ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



శేషవాహనంపై స్వామి, అమ్మవార్లు

తీపిలేని మామిడి

● అరకొర దిగుబడికి అంతంత మాత్రపు ధర ● పెట్టుబడులు కూడా రావంటున్న రైతులు



బాక్సులోకి నింపిన మామిడికాయలు

గాండ్లపెంట, మే 9(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది కనీసం పెట్టుబడులైనా దక్కుతాయా అని మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలో సస్య రక్షణ చర్యలు పాటించినా ఈ ఏడాది దిగుబడి అరకొరగానే వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. మండలంలో వెయ్యి ఎకరాలకు పైగా మామిడి తోటలు సాగులో ఉన్నాయి. ఎరువులు, పురుగుమందులు, కలుపుతీత వంటి వాటి కోసం పూత దశ నుంచి నేటి వరకు ఎకరాకు రూ.30వేలు ఖర్చు చేసినట్లు తెలిపారు. తొలుత పూత బాగా రావడంతో రైతులతో పాటు వ్యాపారులు కూడా సంబరపడ్డారు. అయితే ఆ పూత చాలా వరకు రాలిపోయింది. దీంతో రైతుల ఆశలు సన్నగిల్లాయి. కాస్తకూస్తో కాసిన పిందెలను కాపాడుకోవడానికి ఎంతో శ్రమించారు. అరకొరగా ఉన్న కాయలు కూడా అకాల వర్షాలు, గాలులకు చాలావరకు రాలిపోయాయి. మిగిలిన కాయలను రైతులు తొలగించి మార్కెట్‌కు తరలిస్తున్నారు. టన్ను రూ.30 వేల నుంచి రూ.40వేలు పలుకుతోంది. ఎగుమతులు లేకపోవడమే ధర తగ్గడానికి కారణమని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో పెట్టుబడులు కూడా దక్కవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పక్క రాష్ట్రాలకు తరలింపు

మామిడి కాయల సీజన్‌లో పక్క రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసేవారు. గతంలో మామిడికి మంచి ధరలు ఉండటం వల్ల వ్యాపారులు, రైతులకు మంచి లాభాలు వచ్చేవి. గడిచిన రెండు సంవత్సరాలుగా మామిడికి ధరలు లేక నష్టాల బాట పడుతున్నారు. దీంతో వ్యాపారులు, రైతులు మామిడికాయలను కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు తరలిస్తున్నారు. అక్కడా గిట్టుబాటు ధరలు లేవు. రవాణా ఖర్చులు పోతే టన్నుకు రూ. 30వేలు వస్తోందని, ఇలా అయితే రూ.లక్షలో నష్టపోవాల్సి ఉంటుందని రైతులంటున్నారు.

గడ్డుకాలమే



మామిడి తోటల్లో ఈ ఏడాది ఆశించిన దిగుబడులు లేవు. అయితే మంచి ధరలు పలుకుతాయని ఆశలు ఉండేవి. గత 20రోజుల ముందు టన్ను రూ.60 వేల నుంచి రూ.80వేల దాకా ఉండేది. ఉన్నఫలంగా బేనీషీ రకం టన్ను రూ. 30వేల నుంచి 40వేల మధ్యకు పడిపోయింది. ఇలా ధరలు అంతంతమాత్రమే ఉండటంతో ఈఏడాది కూడా వ్యాపారులు, రైతులకు నష్టం తప్పేలా లేదు.

-రామకృష్ణ, వ్యాపారి, గాండ్లపెంట

మార్కెట్ సౌకర్యం ఏదీ?

ఉమ్మడి జిల్లాలో మెట్ట భూముల్లో మామిడిని అత్యధికంగా సాగు చేస్తున్నారు. మామిడికి ప్రభుత్వం మార్కెట్ సౌకర్యం కల్పించకపోవడంతో రైతుల నుంచి వ్యాపారులు వారికి నచ్చిన ధరకు కొనుగోలు చేస్తున్నారు. విధిలేని రైతులు కాయలను అయినకాడికి అమ్ముకోవాల్సి ఉంది. ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే వ్యాపారుల దోపిడీ తగ్గుతుందని పలువురు రైతులు చెబుతున్నారు.


కడుపు కోత.. తల్లి జ్యోతీబాయి

చిన్నప్పట్నుంచీ ఒకటే లక్ష్యం.. సైన్యంలో చేరాలని. వేరే ఉద్యోగం వద్దన్నాడు. సైనికుడినే అవుతానన్నాడు. ఎంతో కష్టపడ్డాడు. కిలోమీటర్లు పరుగెత్తాడు. ఆఖరుకు అనుకున్నది సాధించాడు. అగ్నివీర్‌కు ఎంపికై, సైన్యంలో చేరాడు. భరతమాత రక్షణ కోసం వీరోచిత పోరాటం చేశాడు. శత్రువులను చెండాడి.. రణభూమిలో వీరమరణం పొందాడు.. గోరంట్ల మండలం కళ్లితండాకు చెందిన జవాను మురళీనాయక్. భారత్-పాక్ యుద్ధంలో మురళీనాయక్ వీరోచిత పోరాటానికి దేశం సెల్యూట్ చేస్తోంది. ఊరూరా నివాళులు అర్పిస్తున్నారు. కొవ్వొత్తుల ర్యాలీలు చేస్తున్నారు.

అగ్నివీరుడై.. శతఘ్ని శూరుడై...




తల్లిదండ్రులతో..

శత్రుమూకలను చెండాడి..

భరతమాత ముద్దుబిడ్డ వీరమరణం

రణభూమిలో జవాను మురళీనాయక్ మృతి

ఊరూరా నివాళులు.. కొవ్వొత్తుల ర్యాలీలు..

హిందూపురం, మే 9(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో దేశ సరిహద్దులో గురువారం రాత్రి జరిగిన భీకర పోరులో గోరంట్ల మండలానికి చెందిన అగ్నివీర్ జవాను మురళీనాయక్ (25) వీరమరణం పొందారు. గోరంట్ల మండలం గడ్డంతండా పరిధిలోని కళ్లితండాకు చెందిన శ్రీరాములునాయక్ జ్యోతీబాయి దంపతుల ఏకైక కుమారుడు మురళీనాయక్. 2000 అక్టోబరు 23న జన్మించారు. చిన్నప్పుడే తల్లిదండ్రులు ముంబైకి వలస వెళ్లారు. అమ్మ పుట్టినిల్లయిన సోమందేపల్లి మండలం నాగినాయనిచెరువు తండాలో అమ్మమ్మ, తాత శాంతిబాయి, నానేనాయక్ వద్ద పెరిగారు. సోమందేపల్లిలోని విజ్ఞాన్ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నారు. ఇంటర్, డిగ్రీ అనంతపురంలోని ప్రైవేటు కళాశాలలో చదివారు. చిన్నప్పట్నుంచి ఆర్మీలో చేరాలని ధ్యేయం పెట్టుకున్నాడు. 2025 నవంబరులో అగ్నివీర్‌కు ఎంపికై సైన్యంలో చేరారు.

ఊరికొస్తే రోజంతా ఆటలే..

మురళీనాయక్ సెలవు తీసుకుని సొంతూరు కళ్లితండాకు వస్తే స్నేహితులతో కలిసి రోజంతా క్రికెట్, వాలీబాల్, ఖో-ఖో, టెన్నిస్, ఆడేవారు. ఉద్యోగం రాకముందు కళ్లితండా నుంచి పుట్టపర్తి క్రాస్ వరకు సుమారు 20కి.మీ. దూరం రన్నింగ్ చేసేవారు. ఎలాగైనా ఆర్మీలో చేరాలనేదే ధ్యేయం. ఏదైనా శుభకార్యం జరిగితే సెలవుపై వస్తే అందరితో కలుపుకుని ఉల్లాసంగా గడిపేవారు. మూడేళ్ల క్రితం తండాలో వినాయక నిమజ్జనం సందర్భంగా నృత్యం చేస్తూ స్నేహితులతో ఉల్లాసంగా గడిపారు. తండాలో మురళీనాయక్ ఒక్కరే సైన్యంలో పనిచేస్తున్నారు.

వేరే ఉద్యోగం వద్దని..

డిగ్రీ పూర్తయిన తరువాత మురళీనాయక్‌కు వేరే ఉద్యోగం చేసుకోవాలని తల్లిదండ్రులతోపాటు అవ్వతాతలు చెప్పారు. అవసరమైతే డబ్బు కూడా ఖర్చుచేస్తామని చెప్పారు. అయినా ఆర్మీలోనే పనిచేయాలని వెళ్లారు. స్నేహితులు కూడా వేరే ఉద్యోగం కోసం ప్రయత్నం చేయాలని చెప్పినా వారిమాట కూడా వినలేదు. ఇంకో ఏడాది ఆర్మీలో పనిచేసి స్వగ్రామానికి వస్తానని ఇటీవల స్నేహితులతో చెప్పారు.

విషాదంలో తండా

మురళీనాయక్ వీరమరణం పొందారని తెలియగానే ఒక్కసారిగా కళ్లితండాలో విషాదం అలుముకుంది. తండాలో ఏ ఒక్కరూ పనులకు వెళ్లకుండా దేశం కోసం ప్రాణాలు అర్పించిన మురళీనాయక్‌ను తలుచుకుంటూ రోజంతా గడిపారు. గురువారం రాత్రి మురళీనాయక్ బుల్లెట్ దెబ్బలతో వీరమరణం పొందారు. శుక్రవారం ఉదయం కమాండర్.. మురళీనాయక్ తల్లి జ్యోతీబాయికి ఫోన్ చేసి, విషయం చెప్పారు. దీంతో ఆమె సొమ్మసిల్లి పడిపోయారు. చుట్టుపక్కలవారు వెళ్లి ఏం జరిగిందని ఆరాతీయగా.. ఆపరేషన్ సిందూర్‌లో మురళీనాయక్ మృతిచెందినట్లు తెలుసుకున్నారు.

తల్లిదండ్రులు, స్నేహితులతో చివరి మాటలు

గురువారం రాత్రి 7-8గంటల మధ్యలో తల్లిదండ్రులకు మురళీనాయక్ ఫోన్‌చేసి యోగక్షేమాలపై ఆరాతీశారు. తాను క్షేమంగా ఉన్నాననీ, భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. స్నేహితుడు వినోద్‌నాయక్‌కు ఫోన్‌చేసి, భీకర యుద్ధం జరుగుతోందనీ, కాల్పులు కూడా జరుగుతున్నాయని చెప్పారు. ఈ రాత్రి గడిస్తే తనకు పునర్జన్మేనన్నారు. తనకేమైనా జరిగితే అమ్మానాన్నలను బాగా చూసుకోవాలని వినోద్‌కు చెప్పారు. ధైర్యంగా ఉండాలని వినోద్ చెప్పాడు.

జాతరకు వచ్చిన తల్లిదండ్రులు

తల్లిదండ్రులు ముంబైకి వలస వెళ్లారు. అక్కడే చిన్న వ్యాపారం చేసుకుంటూ కూలి పనులకు వెళ్తుండేవారు. రెండేళ్ల క్రితం కళ్లితండాలో ఇల్లు కట్టుకున్నారు. మంగళవారం తండాలో జాతర ఉండడంతో శ్రీరాములునాయక్, జ్యోతీబాయి వచ్చి, ఇక్కడే ఉన్నారు.

ఎస్కేయూ గోల్డ్ మెడలిస్ట్

అనంతపురం సెంట్రల్: యుద్ధంలో వీరమరణం పొందిన మురళీ నాయక్ ఎస్కేయూ గోల్డ్‌మెడలిస్ట్. ఎస్కేయూ అనుబంధ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ బీకామ్ పూర్తిచేసిన మురళీనాయక్ ఎన్‌సీసీ క్యాడెట్‌గా బీ సర్టిఫికెట్ పొందారు. చదువుతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు, క్రీడల్లో చురుకైన పాత్ర పోషించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సాకే అంజనేయులు పర్యవేక్షణలో క్రీడాశిక్షణ పొందారు. సౌతిండియా యూనివర్సిటీస్ ఇంటర్నల్ టోర్నమెంట్‌లో మురళీనాయక్ అసాధారణ ప్రతిభ చూపారు. చెన్నైలో నిర్వహించిన హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌లో ఎస్కేయూ తరపున ప్రాతినిధ్యం వహించి, గోల్డ్‌మెడల్ కైవసం చేసుకున్నారు. తనవద్ద క్రీడా, ఎన్‌సీసీ శిక్షణ పొందిన మురళీనాయక్, లోకేష్ నాయక్ ఆర్మీకి సెలెక్ట్ అయ్యారని ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ అంజనేయులు.. 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. మురళీ నాయక్ వీరమరణం పొందటం బాధాకరమని అంజనేయులు ఆవేదన వ్యక్తంచేశారు.


మురళీనాయక్ ఇంటి వద్ద పోలీసులు, స్నేహితులు


పదో తరగతి గ్రూప్ ఫొటోలో మురళీనాయక్ (వృత్తంలో..)


స్నేహితుడి పెళ్లి సందర్భంగా బస్సులో మిత్రులతో కలిసి సెల్ఫీ..



తండాకొస్తే రోజంతా ఆటలే: సాయినాయక్, కళ్లితండా

స్నేహితుడు మురళీనాయక్‌తో 20 ఏళ్ల బంధం. మా తండాకు ఎప్పుడు వచ్చినా రోజంతా ఆటలతోనే గడిపేవాడు. రాత్రయినా తమతోనే ఉండేవారు. మూడు రోజుల క్రితం కూడా ఫోన్‌చేసి మాట్లాడారు. గ్రామంలో మంగళవారం జాతర జరిగింది. అదేరోజు వీడియోకాల్ చేసి మాట్లాడాడు. తాను రాలేకపోయాననీ, సెలవు ఇవ్వలేదనీ, అందరూ ఎంజాయ్ చేయండని చెప్పారు.



కొన్ని గంటల ముందే ఫోన్ చేశాడు: వినోద్‌నాయక్, కళ్లి తండా

మురళీనాయక్, నేను ఒకే రోజు పుట్టాం. అప్పట్నుంచి ఇప్పటి వరకు ప్రాణస్నేహితులుగానే ఉన్నాం. వారంలో నాలుగైదుసార్లు ఫోన్‌లో మాట్లాడతాడు. ఆఖరిగా గురువారం రాత్రి 9 గంటల సమయంలో ఫోన్ చేసి మాట్లాడాడు. ఆ మాటలు ఇప్పటికీ తలచుకుంటే ఏడుపు వస్తుంది.



మరువలేకపోతున్నాం: వేణుగోపాల్‌నాయక్, కళ్లి తండా

నా స్నేహితుడు మురళీనాయక్ దేశం కోసం ప్రాణాలు విడిచాడని గర్వంగా ఉన్నా.. ఇక మాతో కలిసి తిరగడనే విషయం బాధ కలిగిస్తోంది. జాతరకు వస్తానని చెప్పి రాలేకపోయాడు. అలాంటి స్నేహితుడు దూరం కావడం దురదృష్టకరం.



చదువుకునే రోజుల్లోనే దేశం గురించి మాట్లాడేవాడు..

మురళీనాయక్ విజ్ఞాన్ పాఠశాలలో 1-10వ తరగతి వరకు చదివాడు. చదువుకునే రోజుల్లోనే దేశానికి సేవ చేయాలన్న ఆకాంక్ష ఉండేది. పాఠశాలలో ఏ కార్యక్రమం జరిగినా దేశ సేవ గురించి మాట్లాడేవాడు. ఆర్మీలో చేరతానని చెప్పేవాడు. వీరమరణం పొంది భరతమాత ముద్దుబిడ్డ అయ్యాడు. మా పాఠశాల విద్యార్థి అని చెప్పుకోవడానికే గర్వపడుతున్నాం.

-మల్లికార్జున, కరస్పాండెంట్, విజ్ఞాన్ పాఠశాల, సోమందేపల్లి

రాత్రి ట్యూషన్ వదిలితే నా వెంట వచ్చేవాడు..



అవ్వ, తాత ఇంటి వద్ద ఉంటూ మురళీనాయక్ నాగినాయనిచెరువు తండా నుంచి సోమందేపల్లికి పాఠశాలకు వెళ్లేవాడు. రాత్రి ట్యూషన్ వదిలాక కాలినడకన వచ్చేవాడు. చాలాసార్లు నేను బైక్‌పై ఎక్కించుకుని వచ్చేవాడిని. ఈరోజు వీరమరణం పొందాడని తెలిశాక ఇలాంటి సైనికుడిని నా బైక్‌లో ఎక్కించుకుని వెళ్లానా.. అని గర్వంగా ఉంది.

- అంజనేయులు, నాగినాయనిచెరువు తండా


పెనుకొండలో మంత్రి సవిత ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ


పుట్టపర్తిలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి నివాళి


శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్, జేసీ, ఇతర అధికారులు నివాళి..


హిందూపురంలో కొవ్వొత్తుల ర్యాలీ


నివాళులు అర్పిస్తున్న ఎస్పీ రత్న

జిల్లా రుణం తీర్చుకుంటా

(5వ పేజీ తరువాయి)

తెలిపింది. తన కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంది. బంగారు కుటుంబం కింద ఎంపికైనందున ఏదో సాయం చేసి వదిలేసేది లేదని, పిల్లలకు చదువులు, పక్కా ఇల్లు, ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. బంగారు కుటుంబాలను ఆదుకోవడానికి మార్గదర్శిగా ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్త అనంతయ్య మాట్లాడుతూ పార్వతి భర్తకు సెక్యూరిటీ గార్డుగా తాను ఉద్యోగం ఇస్తానని, వారి పిల్లల చదువులకు ఆర్థిక సాయం చేస్తానని హామీ ఇచ్చారు. మరో మార్గదర్శి రామకృష్ణ గ్రామంలోని 15 కుటుంబాలను దత్తత తీసుకుంటానని ప్రకటించడంతో సభలో కరతాళధ్వనులు మిన్నంటాయి.


హంద్రీనీవా పనులను పరిశీలిస్తున్న సీఎం, మంత్రులు

ఎన్ని ఇబ్బందులు వచ్చినా అధిగమించాలి

హంద్రీనీవా కాలువ వెడల్పు పనులలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా అధిగమించి, గడువులోపు పూర్తి చేయాలని హెచ్‌ఎన్ఎస్ఎస్ అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఛాయాపురం గ్రామ సమీపంలో హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను హెచ్‌ఎన్ఎస్ఎస్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎంత మేరకు పనులు జరిగాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. హంద్రీనీవా పనులపై అధికారులు ఏర్పాటు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కాలువలో నుంచే జరుగుతున్న పనులను డ్రోన్ ద్వారా పరిశీలించారు.

రాయలసీమ భాగ్యప్రదాత బాబు: పయ్యావుల

రాయలసీమ భాగ్యప్రదాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ప్రజావేదికలో ఆయన మాట్లాడుతూ ఇజ్రాయెల్ దేశ డ్రిప్ విధానాన్ని 30 ఏళ్ల కిందటే గుర్తించిన దార్శనికుడు చంద్రబాబు అని కొనియాడారు. డ్రిప్ విధానంతో వ్యవసాయంలో ఆ దేశం కొత్త పుంతలు తొక్కిందని గుర్తించి, ప్రత్యేక బృందాలను ఆ దేశానికి పంపి రాష్ట్రంలో డ్రిప్ సేద్యానికి శ్రీకారం చుట్టారన్నారు. నియోజకవర్గంలో రూ. 800 కోట్లతో మెగా డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు చంద్రబాబు అంకురార్పణ చేస్తే, జగన్ ఐదేళ్ల పాలనలో డ్రిప్ అనే మాటే వినపడకుండా చేశాడని విమర్శించారు. చంద్రబాబు 2014-19 మధ్య కాలంలో తన ప్రతి పుట్టినరోజుకు ఓ కొత్త ప్రాజెక్టును జిల్లాకు తెచ్చారన్నారు. గొల్లపల్లి రిజర్వాయరు, హెచ్చెల్సీ ఆధునికీకరణ, బీటీపీ, హంద్రీనీవా వైడెనింగ్, కియ పరిశ్రమ తదితర ప్రాజెక్టులు తెచ్చారన్నారు. హంద్రీనీవా వైడెనింగ్‌ను మూడు నెలల్లో పూర్తిచేస్తానన్న జగన్ ఐదేళ్లు గంప మన్నుకూడా ఎత్తలేదని ఎద్దేవా చేశారు. హంద్రీనీవా కారణంగా సాగుభూముల ధరలు ఐదు రెట్లు పెరిగాయన్నారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో సాగునీటి ప్రాజెక్టులకు రూ. 72 వేల కోట్లను కేటాయిస్తే, జగన్ రూ.22 వేల కోట్లను మాత్రమే ఖర్చు చేశారన్నారు. రాయలసీమకు టీడీపీ ప్రభుత్వం రూ. 12,421 కోట్లను ఇస్తే, రాయలసీమ బిడ్డను అని చెప్పుకునే జగన్ రూ. 2,011 కోట్లను కేటాయించి ద్రోహం చేశారన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వినోద్ కుమార్, సహాయ కలెక్టరు సచిన్ రహార్, హంద్రీనీవా సీఈ నాగరాజు, ఎస్ఈ రాజా స్వరూప్ కుమార్, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, గుమ్మనూరు జయరాం, దగ్గుపాటి ప్రసాద్, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, ఏడీసీసీబీ చైర్మన్ ఎం కేశవరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, నాయకులు ఆలం నరసానాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా టేబుల్ బుక్ కాఫీ ఆవిష్కరణ

ప్రజావేదిక సభలో సీఎం చంద్రబాబు నాయుడు జిల్లా టేబుల్ బుక్ కాపీని ఆవిష్కరించారు. సీఎం మాట్లాడుతూ జిల్లా టేబుల్ బుక్ అద్భుతంగా ఉందని అభివర్ణించారు. దీన్ని తయారు చేయడంలో జిల్లా కలెక్టర్ బాగా కష్టపడ్డారని అభినందించారు. జిల్లా వారసత్వం, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, భౌగోళికం, పర్యాటకం, ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం, ఇతర అంశాల కలబోత కాఫీ బుక్ అని పేర్కొన్నారు. ఈ బుక్‌ను బెంగళూరుకు చెందిన బంక్‌ల్యాబ్ ప్రతినిధులు 128 పేజీలతో తయారు చేసినట్లు జిల్లా అధికారులు తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులతో సమాచారం సేకరించి బంక్ ల్యాబ్ ప్రతినిధులు సిద్ధం చేశారన్నారు. కార్యక్రమంలో మంతులు పయ్యావుల కేశవ్, రామానాయుడు పేర్కొన్నారు.

ఎంపీ 'అంబికా'కు సీఎం పరామర్శ

అనంతపురం అర్బన్: అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను సీఎం చంద్రబాబు ఫోన్ ద్వారా పరామర్శించారు. ఎంపీసోదరి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించగా, ఆయన బావ గాయపడ్డారు. డెహ్రాడూన్‌కు రెండు చార్టెడ్ ఫ్లైట్స్‌ను శనివారం పంపుతామని, ఒక దానిలో సోదరి మృతదేహం, మరోదానిలో బావను తీసుకొచ్చి హైదరాబాద్‌లో మెరుగైన వైద్యసేవలు అందించాలని సీఎం సూచించారు. విపత్కర పరిస్థితుల్లో తన కుటుంబానికి అండగా నిలిచిన సీఎం చంద్రబాబుకు ఎంపీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాను టాప్ 3లో నిలపాలి

- భూగర్భ జలాల పెంపునకు ప్రణాళికలు సిద్ధం చేయండి
- అధికారులు, ప్రజాప్రతినిధులకు సీఎం ఆదేశం


ప్రజాప్రతినిధులు, అధికారులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అనంతపురం మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లాను అన్ని రంగాల్లోనూ టాప్ 3లో నిలపడానికి కృషి చేయాలని సీఎం చంద్రబాబునాయుడు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులను ఆదేశించారు. ఆమేరకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. వజ్రకరూరు మండలం ఛాయాపురంలో హంద్రీనీవా కాలువ పనుల విస్తరణ, లైనింగ్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రజావేదిక అనంతరం హెలిప్యాడ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో చంద్రబాబు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. ముందుగా వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూల మాల వేసి సీఎం శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జిల్లా అభివృద్ధిపై దిశానిర్దేశం చేశారు.

వ్యవసాయంలో డ్రోన్లు

ఇరిగేషన్‌కు సంబంధించి డ్రోన్లను భిన్నమైన టైమ్స్‌లో, డిఫరెంట్ లేయర్స్ పెట్టుకొని ప్రతి రోజు ఎంత పనికి వినియోగించామో చూసుకోవాలన్నారు. మ్యానువల్‌కు, డ్రోన్ వినియోగానికి తేడా ఉందా..? లేదో తెలుసుకోవాలన్నారు. ఐటీ టీం ద్వారా వీటిని ఎలా వినియోగించాలో తెలుసుకోవాలన్నారు. జిల్లాలోని మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు సమన్వయం చేసుకొని విజన్- 2047కు సంబంధించి స్వర్ణాంధ్రప్రదేశ్‌లో భాగంగా ఎవరికివారు నియోజకవర్గాలను ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలో గుర్తించాలన్నారు. ఆర్థిక పరంగానే కాకుండా మామూలుగా అయ్యే పనులు చాలానే ఉన్నాయని, వాటన్నింటినీ పూర్తి చేస్తే మంచి పేరు వస్తుందన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ బంగారు కుటుంబానికి సంబంధించి దత్తత తీసుకోవాలన్నారు. ఆయా లబ్ధిదారులను గుర్తించి దత్తత తీసుకోవాలన్నారు. ఇందుకోసం నియోజకవర్గ స్థాయిలో ఐదుగురు అధికారులను నియమిస్తున్నామన్నారు. జిల్లాలో ఉత్తమ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమిస్తామన్నారు. రాష్ట్రంలో 10వేల కిలో మీటర్ల రోడ్ల నిర్మాణానికి రూ.1.5లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నట్లు వెల్లడించారు. జిల్లాలో పౌల్ట్రీ రంగం తక్కువ ఉందన్నారు. పారిశ్రామిక రంగం, సర్వీస్ సెక్టార్‌ను మరింత అభివృద్ధి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని చెరువులకు నీరు ఇస్తే భూగర్భజలాలు పెరుగుతాయని, ఇందుకు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు బండారు శ్రావణి శ్రీ, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, గుమ్మనూరు జయరాం, అమిలినేని సురేంద్రబాబు, జలవనరుల శాఖ సెక్రటరీ సాయిప్రసాద్, కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణశర్మ, వ్యవసాయ, అనుబంధ శాఖలు, భూగర్భజల శాఖ, డీఆర్‌డీఏ, డ్వామా, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీచర్ల బదిలీలకు సన్నద్ధం

- శారదాస్కూల్‌లో ప్రత్యేక కేంద్రం
- 16 వేలకుపైగా టీచర్ల సీనియారిటీ జాబితా సిద్ధం

అనంతపురం విద్య, మే 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల కల్పనకు ఉమ్మడి జిల్లా విద్యాశాఖాధికారులు సన్నద్ధం అవుతున్నారు. ఉత్తర్వులు రాగానే ప్రక్రియను సజావుగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనుల కోసం అనంతపురం ఒకటో రోడ్డులో ఉన్న శారదా మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశారు. కంప్యూటర్లను సిద్ధం చేశారు. డీఈఓ ప్రసాద్‌బాబు, ఏడీ క్రిష్ణయ్య సిబ్బందితో సమావేశమై.. బదిలీల ప్రక్రియతో నిర్వహణ, టెన్నికల్ టీమ్స్, ఇతర టీమ్స్ ఏర్పాటు గురించి చర్చించారు.

సెలవులు రద్దు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 16 వేల మందికిపైగా ఉపాధ్యాయుల ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాలు సిద్ధం చేశారు. చిన్నపాటి పొరపాట్లు, అభ్యంతరాలు ఉంటే మార్పులు, చేర్పులు చేసే అవకాశం ఉంది. చాలా వరకూ జాబితాను సిద్ధం చేసినట్లు స్పష్టమవుతోంది. కమిషనర్ నుంచి ఆదేశాలు రాగానే ఫైనల్ సీనియారిటీ జాబితాలు ప్రకటించే అవకాశం ఉంది. స్కూళ్ల పునర్నిర్మాణం, టీచర్ పోస్టుల నియామకం, ఖాళీల వివరాలను డైరెక్టర్ నుంచి వచ్చే ఆదేశాల మేరకు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. త్వరలో బదిలీలు, ప్రమోషన్ల నిర్వహణకు ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉండటంతో, శని, ఆదివారాల్లో ఉద్యోగులు అప్రమత్తంగా ఉండేలా చూడాలని కమిషనర్ విజయరామరాజు, ఆర్‌జేడీ శామ్యూల్ ఉమ్మడి జిల్లా అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. అత్యవసరం అయితే తప్ప సెలవులు తీసుకోకూడదని, నిత్యం అందుబాటులో ఉండాలని సూచించినట్లు సమాచారం.


టీమ్స్ ఏర్పాటుపై అధికారులకు ఆదేశాలిస్తున్న డీఈఓ

రానున్న ఐదు రోజులకు వర్షసూచన



బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి శుక్రవారం తెలిపారు. ఈదరుగాలులు ఆగ్నేయం దిశగా గంటకు 8 కి.మీ, నుంచి 13 కి.మీ, వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు పశువులు, మేకలు, గొర్రెల విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. వరికోతలు ఉన్న రైతులు వాతావరణానికి అనుకూలంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

న్యూస్ బాక్స్


బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వడ్డీతో రుణాలు రెన్యువల్ చేయాలి

తనకల్లు, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటిక్రాస్‌లో ఉన్న యూనియన్ బ్యాంక్‌లో రుణాలు పొందిన రైతులందరికి వడ్డీతోనే రుణాలను రెన్యువల్ చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. అసలు, వడ్డీ చెల్లించలేక రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు డబ్బులు తీసుకోవాల్సి వస్తోందన్నారు. అసలు, వడ్డీలు చెల్లిస్తేనే రుణాల రెన్యువల్ చేస్తామని బ్యాంక్ అధికారులు చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం బెల్లం మహాదేవ్, కాటమయ్య, చౌడప్ప, ఇక్బాల్ సీపీఐ కార్యదర్శి రెడ్డెప్ప పాల్గొన్నారు.

పోస్టుల మంజూరుపై హర్షం


కేక్ కట్ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ధర్మవరం, మే 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం కొత్తగా మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో దాదాపు 1800 హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్ల పోస్టులను మంజూరు చేయడంపై యూటీఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో వారు కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శెట్టిపి జయచంద్రారెడ్డి, రామకృష్ణనాయక్, బిల్లే రామాంజినేయులు, ఆంజనయులు, లక్ష్మయ్య, అమర్‌నారాయణరెడ్డి, సాయిగణేశ్, రామాంజినేయులు, ఆదిశేషు, హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ముదిగుబ్బ, మే 9(ఆంధ్రజ్యోతి): స్థానికంగా శుక్రవారం జరిగే వారపు సంతలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఎయిడ్స్ కట్టడిపై వీధి నాటకం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ ఎలా వ్యాపిస్తుంది.. ఆ వ్యాధి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. తదితర వాటిపై సరోజమ్మ కళా బృందం అవగాహన కల్పించింది. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రాజేంద్ర, ఐసీటీసీ కౌన్సిలర్ వెంకట నారాయణ పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ హమాలీల సమ్మె నోటీసు


సీఎస్‌డీటీకి వినతిపత్రం ఇస్తున్న హమాలీలు

కదిరిఅర్బన్, మే 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న చేపట్టబోయే దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నట్లు మండల సివిల్ సప్లయ్ హమాలీలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సీఎస్‌డీటీ నాగేంద్రకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు ఫక్రుద్దీన్, మహబూబ్‌బాషా, గంగాద్రి, చెండ్రాయుడు, ముబారక్ పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి

బుక్కపట్నం, మే 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కోటికి క్రిష్టప్ప (85) శుక్రవారం అనారోగ్యంతో మరణించాడు. బుక్కపట్నం మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్‌గా ఆయన పనిచేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మృతుడి కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించారు.


క్రిష్టప్ప (ఫైల్)

కళాశాలలో అధ్యాపకుల కొరత

● పదేళ్లుగా రెగ్యులర్ లెక్చరర్లు లేని తాడిమర్రి కాలేజీ



తాడిమర్రి, మే 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు లెక్చరర్లను నియమించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇతర కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులను ఇక్కడికి నియమించుకుని పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. పదేళ్లుగా ఈ తంతు సాగుతున్నా దీని గురించి పట్టించుకున్న నాథుడేలేడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది నిర్వహించిన ఇంటర్ పరీక్షలకు ఈ కళాశాల నుంచి ప్రథమ సంవత్సరం 57 మంది, ద్వితీయ సంవత్సరం 27 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ ఏడాది మరో 100 మందికిపైగా విద్యార్థులు కళాశాలలో చదువుకునేందుకు దరఖాస్తు చేసే అవకాశం ఉంది. ఇన్నాళ్లు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసిన అధ్యాపకులు కాకుండా ఈ ఏడాదైన రెగ్యులర్ లెక్చరర్లను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇటీవల మండలంలో పర్యటించిన మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి విద్యార్థుల తల్లిదండ్రులు సమస్యను తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి అప్పటికప్పుడు విద్యాశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడారు. వెంటనే లెక్చరర్లను నియమించాలని మంత్రి ఆదేశించి మూడు నెలలు గడుస్తున్నా విద్యాశాఖ నుంచి స్పందన లేదు. మరో నెల రోజుల్లో కళాశాల ప్రారంభమవుతున్న దృష్ట్యా సబ్జెక్టు లెక్చరర్లను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నివేదికలు పంపాం: సయ్యద్‌మౌలా, డీఐఈఓ

తాడిమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అధ్యాపకులను కేటాయించాలని ఉన్నత విద్యాశాఖ అధికారికి నివేదికలు పంపాం. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనంగా ఉన్న అధ్యాపకులను తాడిమర్రితో పాటు ఇతర కళాశాలలకు కేటాయించే అవకాశం ఉంది. ప్రభుత్వం ఇప్పటికే అదనపు అధ్యాపకుల వివరాలను అడిగి తీసుకున్నారు. త్వరలో సమస్య పరిష్కారమవుతుంది.


కొత్తచెరువులో నివాళులర్పిస్తున్న గ్రామస్థులు


నల్లచెరువులో కొవ్వొత్తులతో నివాళి

వీర జవాను మురళీనాయక్.. అమర్ రహే..!

పలు ప్రాంతాల్లో ఘన నివాళి

నంబులపూలకుంట, మే 9(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు పలువురు నివాళులర్పించారు. మండలంలో తిమ్మమ్మ మర్రిమను గ్రామంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు జయరాం, గ్రామస్థులు పాల్గొన్నారు.

● మరణం.. బాధాకరం: సీపీఐ

పుట్టపర్తిటౌన్ : పాకిస్థాన్ సరిహద్దుల్లో వీరజవాన్ మురళీనాయక్ వీరమరణం పొందడం బాధాకరమని సీపీఐ కార్యదర్శి వేమయ్య యాదవ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మృతి యువతలో ఆవేశం, ఆవేదన రగిలిస్తోందన్నారు. ప్రభుత్వం మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

● నల్లచెరువు (కదిరి): నల్లచెరువులోని జిల్లాపరిషత్ పాఠశాల ఎదురుగా వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జైపాల్, సురేష్, ప్రసాద్, సతీష్, శ్రీనివాసులు, జయచంద్రారెడ్డి, భరత్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటం వద్ద పలువురు నివాళర్పించారు. ఇందులో బీజేపీ మండలాధ్యక్షుడు వీరాంజనేయులు, నాయకులు మేకల వెంకటరమణ, క్రిష్టప్ప, సున్నంపల్లి రంగారెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, డ్యాన్స్ మాస్టార్ రవి, మెడికల్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

● రూ.5 కోట్లు పరిహారం ఇవ్వాలి

ఓబుళదేవరచెరువు: వీర జవాన్ మురళీనాయక్ కుటుంబానికి రూ. 5 కోట్లు పరిహారం ఇవ్వాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకుడు శ్రీనివాస్ నాయక్ కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అతని కుటుంబానికి అండగా ఉండాలని కోరారు.

● కొత్తచెరువు: స్థానిక నెహ్రూకూడలిలో వీర జవాన్ మురళీనాయక్ చిత్రపటం వద్ద పలువురు కొవ్వొత్తులతో నివాళులర్పించారు.


ఓడీసీలో నివాళులర్పిస్తున్న నాయకులు


తిమ్మమ్మ మర్రిమాను వద్ద నివాళులర్పిస్తున్న ప్రజలు

శేషవాహనంపై ఊరేగిన సంగమేశ్వరుడు



కొత్తచెరువు, మే 9(ఆంధ్రజ్యోతి): సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజైన శుక్రవారం స్వామివారిని శేషవాహనంపై పురవీధులలో ఊరేగించారు. ముందుగా ఎడ్ల బండిపై శేషవాహనాన్ని ఏర్పాటు చేసి పుష్పాలతో అలంకరించి పార్వతీపరమేశ్వర ఉత్సవ విగ్రహాలను ఉంచి ఊరేగించారు.

నేటి నుంచి యల్లమ్మ తిరునాళ్ల



నంబులపూలకుంట, మే 9(ఆంధ్రజ్యోతి) : స్థానిక యల్లమ్మ తిరునాళ్లను శనివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు కమిటీసభ్యులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం అమ్మవారికి ఒడి బియ్యం కట్టడం, గ్రామంలో ఊరేగింపు, ఆదివారం పుట్టకార్యక్రమం, సోమవారం పాలపొంగుళ్లు, సిద్దల కార్యక్రమం, రాత్రికి జ్యోతులు, బోనాల ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కృపకు పాత్రులు కావాలన్నారు.

అక్కదేవతలకు ఎలవగంప సమర్పణ


అక్కదేవతల వేషధారణలో చిన్నారులు

ఓబుళదేవరచెరువు, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌనిపల్లి వద్ద ఉన్న స్వామాజ్యుల కొండలో వెలసిన అక్కదేవతలకు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఎలవగంపను సమర్పించారు. కరావులపల్లికి చెందిన వెంకటేష్, విశ్రాంత హెల్త్ సూపర్‌వైజర్ ధనలక్ష్మీ పూజా సామగ్రిని సమకూర్చారు. అక్కదేవతల ప్రతిమలుగా ఏడుగురు చిన్నారులు ఎలవగంపను ఉరుముల, వాయిద్యాల నడుమ సమర్పించారు. గౌనిపల్లిలోని పురవీధుల గుండా ఎలవగంపను స్వామాజ్యుల కొండ వరకు ఊరేగించారు. అనంతరం పూజారి పెద్దనారాయణప్ప ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయానికి రథం అందజేత

ధర్మవరం, మే 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కేశవనగర్‌లోని కొత్తగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయానికి ఓంకార్ శిల్క్స్ యజమానులు రథాన్ని గురుస్వామి విజయ్‌కుమార్‌కు శుక్రవారం అందజేశారు. దాతలు మాట్లాడుతూ.. తమ పూర్వీకుల నుంచి అయ్యప్పస్వామిని కొలుస్తున్నామన్నారు. ఈ రథాన్ని బెంగుళూర్‌లో తయారు చేయారు చేయించామన్నారు.


రథం అందజేస్తున్న దాతలు

పాడిపశువుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ధర్మవరంరూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): వేసవిలో పాడిపశువులకు వడదెబ్బ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి శేఖర్ సూచించారు. శుక్రవారం ఆయన చింతలపల్లిలో పాడిపశువులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పశువుల పాక చుట్టూ గోనెసంచెలతో తడిపి కడితే ఉపశమనం కలుగుతుందన్నారు. పాలిచ్చే ఆవులను బయటకు తీసుకెళ్లకుండా పచ్చిగడ్డిని రైతులు తీసుకువచ్చి మేపుకోవాలన్నారు. జీవాలకు నీటి సదుపాయం ఉన్న ప్రాంతాలకు మేతకు తీసుకెళ్లి నీళ్లను ఎక్కువగా అందించాలన్నారు.

విద్యుత్ తీగలను సరి చేయండి

ఓబుళదేవరచెరువు, మే 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారుల నిర్ల క్ష్యం కారణంగా స్థానిక అంబేడ్కర్ కాలనీలోని నీటి ట్యాంక్ వద్ద 11 కేవీ విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయి. ఆ ప్రాంతంలో నిత్యం గొర్రెల కాపరులు, వేసవిలో యువత క్రికెట్ ఆడుతుంటారు. ప్రమాదవశాత్తు జరగరానిది జరిగితే ప్రాణాలు పోక తప్పవని ప్రజలు ఆందోళన చెందతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు ఆ విద్యుత్ తీగలను పైకి లాగాలని ప్రజలు కోరుతున్నారు.


తక్కువ ఎత్తులో ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు

సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం


సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు కందికుంట, పల్లె సింధూరరెడ్డి

పుట్టపర్తిరూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): విజయవాడ గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు సత్యసాయి ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర మంత్రులు సవిత, టీజీ భరత్, హిందూపురం ఎంపీ పార్థసారధి, స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మడకశిరా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, హిందూపురం మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్‌బాబు, కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఎస్పీ వీ.రత్న, జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, సర్పంచు రాము, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి మహమ్మద్‌రఫీ స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం సీఎం ప్రత్యేక హెలీకాప్టర్‌లో అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం ఛాయాపురం వెళ్లారు.

● వినతుల వెల్లువ: సీఎంకు పలువురు ప్రముఖులు వినతులను సమర్పించారు. సత్యసాయి జయంతి ఉత్సవాలకు ప్రత్యేక నిధులు రూ 120 కోట్లు కేటాయించాలని, కొత్తచెరువు మండల కేంద్రంలో ఇండోర్ స్టేడియానికి రూ. 2 కోట్లు, నియోజకవర్గంలోని ఎస్సీ కాలనీల్లో 81 పనులకు రూ 5.50 కోట్లు, 135 సీసీ రోడ్లకు రూ 8.10 కోట్లు, దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు రూ 14.30 కోట్లు, నల్లమాడ మండలం ఎన్టీఆర్ సుజల స్రవంతికి రూ 2.70 కోట్లు, ఓడీచెరువుకు రూ 4.45కోట్లు, అమడగూరు మండలానికి రూ 3.50 కోట్లు కేటాయించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి సీఎంను కోరారు. అలాగే టీడీపీ హయాంలో రూ.1.35 కోట్లతో చేపట్టిన షాదీమహల్ పనులు పూర్తి చేయడానికి రూ.55 లక్షలు మంజూరు చేయాలని రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి మహమ్మద్‌రఫీ సీఎంను కోరారు.

మృతుడి కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం

గాండ్లపెంట, మే 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన మారుతీ ప్రసాద్ ఈనెల 2న రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మృతుడి కుటుంబాన్ని నాలుగు రోజుల క్రితం పరామర్శించారు. మృతుడి కుటుంబానికి రూ.లక్షను బ్యాంక్‌లో శుక్రవారం డిపాజిట్ చేయించారు. కార్యక్రమంలో కన్వీనర్ కొండయ్య, ఆనంద్, ఆక్రమ్‌బాషా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోండి

నంబులపూలకుంట, మే 9(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతికుటుంబ రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ దేవేంద్రనాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రేషన్‌కార్డుల కోసం జీవో జారీ చేసిందని, కార్డులో అదనంగా పేర్ల నమోదు, తప్పులు, అడ్రసు మార్పులు చేసుకునే అవకాశముందని,ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● ఓబుళదేవరచెరువు: అర్హులైన వారు రేషన్‌కార్డుకోసం గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ అనంతచారి, సీఎస్‌డీటీ విజయనిర్మల కోరారు. మండలంలో ఇంకా 2,272 మంది ఈకేవైసీ చేయించుకోలేదన్నారు.

● నల్లమాడ: అర్హులైన వారు రేషన్‌కార్డుకోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రంగనాయకులు, సీఎస్‌డీటీ షబనా సూచించారు. దరఖాస్తులను గ్రామ సచివాలయాల్లో ఇవ్వాలన్నారు.

నేడు, రేపు మంత్రి పర్యటన

ధర్మవరం, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శని, ఆదివారాల్లో ధర్మవరంలో పర్యటిస్తారు. శనివారం ఉదయం 6.30 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహించే మడుగు తేరులో పాల్గొంటారు. 10గంటలకు నుంచి 2గంటల వరకు ఎన్డీఏ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. మధ్యాహ్నం మూడు గంటలకు దుర్గమ్మ సర్కిల్‌లో మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో, సాయంత్రం 5గంటలకు రథోత్సవంలో పాల్గొంటారు. ఆదివారం ఉదయం 10.30గంటలకు బత్తలపల్లిలో తాగునీటి సరఫరా ప్రారంభోత్సవంలో, 11.30 గంటలకు మల్లేనిపల్లిలోని మున్సిపల్ వాటర్ పంప్‌హౌస్ పరిశీలన, మధ్యాహ్నం 12.30 గంటలకు కేశవనగర్‌లో అయ్యప్పస్వామి ఆలయం సందర్శన, ఒంటి గంటకు ఇందిరమ్మకాలనీలో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. 3.45 గంటలకు పోతుకుంటలో ఆర్వో ప్లాంట్ ప్రారంభోత్సవం, పార్క్ నిర్మాణానికి భూమి పూజలో పాల్గొంటారు. అనంతరం విజయవాడకు వెళ్తారు.

వాల్మీకుల పోస్టు కార్డు ఉద్యమం

నల్లమాడ, మే 9(ఆంధ్రజ్యోతి): స్థానిక వాల్మీక నాయకులు శుక్రవారం పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టారు. ప్రధాన మంత్రి స్పందించి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు రమేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్..

ప్రమాదంలో వృద్ధుడి మృతి

గాండ్లపెంట, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీన్లకుంట గ్రామానికి చెందిన వేమన్న (75) ఐజాక్ (కంకర మిషన్) కింద పడి శుక్రవారం మరణించాడు. తన ఇంటికి వెళ్లే మార్గంలో సిమెంట్ రోడ్డు వేస్తున్నారు. వేమన్న తన ఇంటికి వెళ్తుండగా.. ఐజాక్ మిషన్ రివర్స్ చేస్తున్న డ్రైవర్ గమనించకపోవడంతో వేమన్న దాని కింద పడి మరణించారు. వేమన్న కుమారుడు అంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతదేహాన్ని కదిరి ఆస్పత్రికి తరలించామని హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్ తెలిపారు.

గాయపడిన మహిళ..

కదిరిఅర్బన్, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళసముద్రం గురుకుల పాఠశాల వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కాళసముద్రం గ్రామానికి చెందిన నాగలక్ష్మీ (52) తీవ్రంగా గాయపడిన విషయం తెల్సిందే. అనంతపురంలో చికిత్స పొందుతున్న ఆమె శుక్రవారం మరణించారు. నాగలక్ష్మీ, ఆమె కుమారుడు ఆది గురువారం కదిరికి వచ్చి బెల్దారి పని ముగించుకుని ద్విచక్రవాహనంలో తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో వెనుక నుంచి వచ్చిన కారు వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆది అక్కడక్కడే మరణించగా.. నాగలక్ష్మీ గాయపడింది. చికిత్స పొందుతూ ఆమె కూడా మరణించింది. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ ఉపేంద్రపై నాగలక్ష్మీ భర్త మునియప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

ధర్మవరం, మే 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయినగర్‌కు చెందిన రాజుపాల్యం గురుశేఖర్‌తో అదే కాలనీలోని నివాసముంటున్న వీరయ్య, మద్దిలేటికి విభేదాలున్నాయి. దీంతో గురువారం రాత్రి వీరిద్దరూ గురుశేఖర్ ఇంటోలోకి దూరి.. అతనిపై, అతని కుటుంబ సభ్యులపై ఇనుపపైపు, కట్టెలతో దాడిచేసి గాయపరిచారు. గురుశేఖర్ ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్‌సీఐ రెడ్డప్ప శుక్రవారం తెలిపారు.

సారా విక్రేత అరెస్టు

కదిరిఅర్బన్, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలప్పగారిపల్లి తండాలో శుక్రవారం తనిఖీలు నిర్వహించామని, నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామని ఎక్సైజ్ ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. అతని నుంచి రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు చెప్పారు.

వ్యక్తి అదృశ్యం

తనకల్లు, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతపల్లి గ్రామానికి చెందిన సులేమాన్ శుక్రవారం ఉదయం నుంచి కనిపించడంలేదని అతని భార్య నౌజీయా పోలీసులకు ఫిర్యాదు చేసింది. వీరికి పదేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు కుమారులు. సులేమాన్ కూరగాయాల వ్యాపారి. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు అన్నమయ్య జిల్లా ములకలచెరువు బ్యాంక్‌లో బంగారు తాకట్టు కోసం వెళ్లిన అతను తిరిగిరాలేదు. తెలిసినవారి వద్ద విచారించినా ఆచూకి లభించలేదు. నౌజీయా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ గోపీ తెలిపారు.

ఎంపీడీఓగా మమతాదేవి



తనకల్లు, మే 9(ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓగా మమతాదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ధర్మవరంలో డిప్యూటీ ఎంపీడీఓగా పని చేస్తున్న మమతాదేవిని ఉద్యోగోన్నతిపై ఎంపీడీఓగా తనకల్లుకు బదిలీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీఓ పూల రెడ్డెప్ప పరిగి మండలానికి బదిలీ అయ్యారు.

తలుపుల ఎంపీడీఓగా నజీమా



కదిరి, మే 9(ఆంధ్రజ్యోతి): తలుపుల ఎంపీడీఓగా నసీమా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అమడగూరు, తలుపుల ఈఓఆర్డీగా విధులు నిర్వహిస్తున్న ఆమె ఎంపీడీఓగా ఉద్యోగోన్నతి పొందారు. ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

న్యూస్ బాక్స్

20న పంచాయతీ కార్మికుల సమ్మె



ఆర్‌ఓకు సమ్మె నోటీసు ఇస్తున్న సీఐటీయూ నాయకులు

పెనుకొండ, మే 9(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులు ఈనెల 20న సమ్మెలో పాల్గొంటున్నట్లు సీఐటీయూ ఆధ్వర్యంలో అధికారులకు సమ్మె నోటీసులు అందించారు. శుక్రవారం సీఐటీయూ నాయకులు నాగరాజు, మహబూబ్‌బాష, నాగేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ ఆర్‌ఓ దినేష్‌కుమార్ సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు బాబావలి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన చట్టాల వల్ల కార్మికుల హక్కులు పూర్తిస్థాయిలో హరిస్తాయన్నారు. రాష్ట్రంలో ఆప్కాస్ రద్దుచేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలనే నిర్ణయాన్ని విరమించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ, ఆనంద్, వెంకటేశ్, నరసమ్మ, చలపతి, జబ్బార్, లక్ష్మీదేవి, మణి, అశ్వర్థప్ప పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడితే చర్యలు: కమిషనర్

పెనుకొండ, మే 9(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాలుష్యంచేసే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ప్రభుత్వం నిషేధించిందని, నగర పంచాయతీ పరిధిలో ఆ కవర్లను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. దుకాణ దారులు, హోటల్ యజమానులు, చికెన్, మటన్ దుకాణాలవారు, ఎవరూ సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ కవర్లు వాడరాదన్నారు. ప్రజలు గమనించి నగర పంచాయతీని కాపాడాలని పేర్కొన్నారు.

అగళికి చేరిన పాఠ్యపుస్తకాలు

అగళి, మే 9(ఆంధ్రజ్యోతి): రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు వచ్చాయని ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు 19,310 నోటుపుస్తకాలు, 10,830 పాఠ్యపుస్తకాలు వచ్చాయని వివరించారు. ఇంకా నాలుగు వేల పుస్తకాలు రావాల్సి ఉందని, అవికూడా త్వరలోనే వస్తాయన్నారు. ఈనెల 20నాటికి విద్యార్థుల కిట్స్, మూడు జతల యూనిఫాం, బూట్లు, డిక్షనరీలు, సాక్స్ పూర్తిస్థాయిలో చేరతాయని తెలిపారు.

రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

అగళి, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇప్పటి వరకు రేషన్‌కార్డు లేనివారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సుబ్బారావు తెలిపారు. ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవచ్చని, అదేవిదంగా మార్పులు, చేర్పులు, కుటుంబ సభ్యుల పేర్లు నమోదు, తొలగించుకోవడం, కార్డు విభజన తదితర వాటిని చేసుకోవచ్చన్నారు. ఆయా గ్రామ సచివాలయాల్లో నమోదుచేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సంఘీభావ ర్యాలీకి తరలిరండి

అమరాపురం, మే 9(ఆంధ్రజ్యోతి): భారత సైనికులకు మద్దతుగా శనివారం మడకశిరలో నిర్వహిస్తున్న సంఘీభావ ర్యాలీకి తరలిరావాలని టీడీపీ మండల కన్వీనర్ గణేష్, నాయకుడు ఆర్‌జే జయకుమార్ పేర్కొన్నారు. అమరాపురం మండల పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలిపారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొంటారని వివరించారు. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు తగిన గుణపాఠాన్ని చెప్పే సమయం ఆసన్నమయిందన్నారు. కార్యక్రమంలో రైతులు, మహిళలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మిక సంఘాలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సర్వర్ సమస్యలను పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పెనుకొండ, మే 9(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి సర్వర్‌తో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వాటిని పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీధర్‌కు ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం వినతి పత్రం అందించారు. కొత్తరేషన్ కార్డుకోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించడంతో.. సచివాలయం-2లో ప్రజలు బారులు తీరారన్నారు. సర్వర్ పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సర్వర్ పనిచేయకపోవడంతో ప్రజలు గంటల తరబడి కార్యాలయంలో పడిగాపులు కాస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రమేష్, నాయకులు కిష్టప్ప, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

పెనుకొండ రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యాధికారి నాగరాజునాయక్ తెలిపారు. గుట్టూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చిన 50 మంది గర్భవతులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భవతులు, బాలింతలకు ఎస్‌ఆర్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, టీడీపీ నాయకులు సూరి, శంకర, వెంకటేశ్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన మున్సిపల్ చైర్మన్

హిందూపురం, మే 9(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును పుట్టపర్తి విమానాశ్రయంలో హిందూపురం మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు మున్సిపల్ చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. పట్టణాభివృద్ధికి రూ.92.50 కోట్లు నిధులు మంజూరు చేయడంతో రుణపడి ఉంటామని అన్నారు.



సీఎంను కలిసిన మున్సిపల్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

వీరజవాను మురళీనాయక్‌కు ఘన నివాళి



మురళీనాయక్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న పెనుకొండ నాయకులు, సోమందేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, గ్రామస్థులు

పెనుకొండ, మే 9(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఇండియా-పాకిస్థాన్ యుద్ధంలో వీర మరణం పొందిన గోరంట్ల మండలం కళ్లితండాకు చెందిన జవాన్ మురళీనాయక్‌కు విశ్వహిందూపరిషత్ నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. శుక్రవారం పెనుకొండ వీహెచ్‌పీ ప్రఖండ్ సభ్యులు వేదవ్యాస్, డాక్టర్ రఘునాథ్, శంకర్‌రెడ్డి, కిష్టప్ప, జయచంద్ర తదితరులు కళ్లితండాకు వెళ్లి జవాన్ మురళీనాయక్ చిత్ర పటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

దర్గాపీఠాధిపతి తాజ్ బాబా సంతాపం

ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన భారత సైనికుడు మురళీనాయక్ మృతిచెందడం బాధాకరమని దర్గాపీఠాధిపతి తాజ్ బాబా సంతాపం తెలిపారు. ఆయన ధైర్యం ప్రతి భారతీయుడి గుండెల్లో నిలిచిపోతుందన్నారు. దేశం కోసం చేసిన ఆయన త్యాగం చిరస్మరణీయంగా నిలుస్తుందని కొనియాడారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

● సోమందేపల్లి : భారత్-పాక్ యుద్ధంలో వీరమరణం పొందిన కళ్లితండాకు చెందిన జవాన్ మురళీనాయక్‌కు స్థానికులు ఘననివాళులర్పించారు. శుక్రవారం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. అనంతరం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలుచేస్తూ ముందుకు కదిలారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మురళీ నాయక్‌ను దేశం మరువదన్నారు. కార్యక్రమంలో నాయకులు నీరుగంటి చంద్ర, వడ్డె సూరి, వెంకటేశులు, కిష్టప్ప, నరసింహులు, నాగరాజు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

● పెనుకొండ టౌన్ : భారత్-పాక్ యుద్ధంలో వీరమరణం పొందిన అగ్నివీర్ జవాను మురళీనాయక్‌కు ఊరూరా నివాళి అర్పించారు. కొవ్వొత్తుల ర్యాలీలు చేశారు.

మంత్రి సవిత ఆధ్వర్యంలో..

మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో పెనుకొండలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. జవాను చిత్రపటం, కొవ్వొత్తులతో 'జోహార్ వీరజవాన్ మురళీనాయక్' అని నినాదాలు చేస్తూ పట్టణంలోని అన్న క్యాంటీన్ నుంచి ఎన్టీఆర్‌సర్కిల్, దర్గా, గాంధీ, తెలుగుతల్లి సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం మౌనం పాటించారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. వీరజవాను కుటుంబంలో ఒకే కొడుకనీ, ఆయన కూడా యుద్ధంలో వీరమరణం పొందారనీ, ఆ కుటుంబానికి దేశం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. పుట్టపర్తిలోని క్యాంపు కార్యాయంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి.. అమర జవాను మురళీనాయక్‌కు నివాళులు అర్పించారు. జవాను చిత్రపటానికి పూలమాలలువేసి, నివాళులు అర్పించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్, టీడీపీ, జనసేన శ్రేణులు ర్యాలీ చేశారు. గోరంట్లలో మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ర్యాలీ చేశారు.



గోరంట్లలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎంపీ తదితరులు

జవాను ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకం

పుట్టపర్తిలోని కలెక్టరేట్‌లో మురళీనాయక్ చిత్రపటానికి కలెక్టర్ టీఎస్ చేతన్, జేసీ అభిషేక్‌కుమార్ ఇతర అధికారులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సరిహద్దులో మురళీనాయక్ ప్రదర్శించిన ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం మురళీనాయక్ చిత్రపటం ముందు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో డీఆర్వో విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, ఏఓ వెంకటనారాయణ పాల్గొన్నారు.

జవాను తల్లిదండ్రులను ఓదార్చిన ఎస్పీ

జవాను మురళీనాయక్ వీరమరణంతో ఆయన తల్లిదండ్రులను ఎస్పీ రత్న ఓదార్చారు. ఎస్పీ.. కళ్లితండాకు వెళ్లి, వీరజవాను మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. జవాను పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ప్రభుత్వ లాంఛనాలతో జవాను అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

సైనికులకు మద్దతుగా నేడు సంఘీభావ ర్యాలీ: ఎమ్మెల్యే

మడకశిర టౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): దేశం కోసం ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్‌కు గట్టిగా బుద్ధి చెబుతూ.. ప్రాణాలు పణంగా పెట్టి సత్తా చాటుతున్న భారత సైనికులకు మద్దతుగా మడకశిరలో సంఘీభావ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలసి శుక్రవారం విలేకరులతో మాట్లాడు తూ.. ఉగ్రవాదులను పెంచి పోషించి అక్రమంగా దేశంలోకి చొరబడి దేశ పౌరులను అన్యాయంగా చంపి దొంగ దెబ్బతీసిన వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. భారత సైనికులకు మద్దతుగా శనివారం ఉదయం 10 గంటలకు మడకశిర పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంత భవనం నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. భారత ఆర్మీ జవాన్, తెలుగుతల్లి ముద్దుబిడ్డ మురళీనాయక్ మృతి అత్యంత బాధాకరం అన్నారు. పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో వీరమరణం పొందిన మురళీనాయక్ ఈ దేశానికి అలందించిన సేవలు తెలుగువారికి గర్వకారణం అన్నారు. సంఘీభావ ర్యాలీకి అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

బాధిత కుటుంబానికి సీఎం భరోసా

● సీఎంఆర్‌ఎఫ్ కింద రూ. 12 లక్షల చెక్కు పంపిణీ

గార్లదిన్నె, మే 9(ఆంధ్రజ్యోతి): విషపు గులికలు మింగి ఆత్మహత్య చేసుకున్న వారి బాధిత కుటుంబానికి సీఎం చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారు. మండలంలోని యర్రగుంట్లకు చెందిన నిమ్మకాయల సురేష్, సుజాత దంపతులు గార్లదిన్నెలో కిరాణ వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవారు. కుటుంబ కలహాలతో గత ఏడాది డిసెంబరు 12న తల్లి సుజాత, కుమారుడు నాగచైతన్య, కుమార్తె రాహిత్యకు విషపు గుళికలు మింగించి తాను ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనలో తల్లి సుజాత, కుమారుడు నాగచైతన్య మృతి చెందగా కుమార్తె చికిత్స పొందుతూ ప్రాణపాయం నుంచి బయటపడింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ చొరవతో సీఎం చంద్రబాబు బాధిత కుటుంబానికి సీఎం సహాయ నిధి ద్వారా రూ. 12 లక్షలు మంజురు చేశారు. ఆ చెక్కును ఎమ్మెల్యే శ్రావణి శ్రీ శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులు సురేష్, రాహిత్యకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నిమ్మకాయల ఈశ్వరయ్య, పరంధా, అనిల్, రామయ్య ఎర్రిస్వామి పాల్గొన్నారు.

బస్సు బోల్తా.. పలువురికి గాయాలు

హిందూపురం, మే 9(ఆంధ్రజ్యోతి):కియా అనుబంధన సంస్థకు కార్మికులను తీసుకు వచ్చి సాయంత్రం తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురైంది. గోరంట్ల మండలం 44వ జాతీయ రహదారిలోని మిషన్ తండా వద్ద కార్మికులను తీసుకెళుతున్న ప్రైవేటు బస్సు బోల్తాపడింది. ఈ ఘటనలో 15 మందికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే గాయాలైన వారిని మరో బస్సులో హిందూపురం తరలించి చికిత్సలు అందించారు. స్వల్పంగా గాయపడిన వారిలో ఓడిసీ మండలానికి చెందినవారుగా తెలిసింది. అయితే దీనిపై ఫిర్యాదు అందలేదని గోరంట్ల సీఐ శేఖర్ తెలిపారు.



పగిలిన బస్సు అద్దాలు

చైర్‌పర్సన్ తనయుడి పెత్తనంతో విసిగిపోయాం

మడకశిర టౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీకి చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ అయితే.. పెత్తనమంతా ఆమె తనయుడు జయరాజ్‌దేనని, అందుకే విసిగిపోయి టీడీపీలోకి చేరి అవిశ్వాస తీర్మానానికి సిద్ధపడినట్లు కౌన్సిలర్లు నాగేంద్ర, బలరామ్ తదితరులు అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ఇక్కడి పరిస్థితులు తెలియక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భయపెట్టి నగర పంచాయతీ కౌన్సిలర్లను పార్టీలోకి చేర్చుకున్నారని ఆరోపించడం తగదన్నారు. జగన్‌రెడ్డి విషయం తెలుసుకోకుండా మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. అక్కడ జరుగుతున్న అవమానాలు భరించలేక, చైర్‌పర్సన్ తనయుడి పెత్తనం వల్ల ఇబ్బందులు పడలేక తాము పార్టీ మారినట్లు వివరించారు. వైసీపీ పాలనలో నగర పంచాయతీ అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, తమకు ఓటు వేసిన వారికి సమాధానం చెప్పలేక పోతున్నామని తెలిపారు. టీడీపీతోనే నగర పంచాయతీ అభివృద్ధి అని పార్టీలోకి మారి అవిశ్వాసానికి సిద్ధమయినట్లు వివరించారు. వైసీపీ అధినేత జగన్ నియోజకవర్గంలో పార్టీ నాయకుల యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకొని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని అన్నారు. సమవేశంలో కౌన్సిలర్లు సుధాకర్ నాయక్, మేఘన రమేష్, విక్రమ్‌చ దాసప్ప పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

వెంటాడుతున్న విత్తన సమస్య

● తగ్గిపోతున్న సాగు విస్తీర్ణం
● వేరుశనగ రైతులకు తప్పని అవస్థలు



పొలంలో దుక్కులు చేసిన దృశ్యం

మడకశిర, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా వేరుశనగ పంట సాగు చేసి నష్టపోతున్న రైతులకు విత్తన సమస్య వెంటాడుతోంది. ఖరీఫ్‌లో సాగుచేసిన పంట దిగుబడి అంతంత మాత్రంగానే రావడంతో రైతుల వద్ద విత్తన కా యలు ఏమీ లేవు. రబీ సీజన్‌లో బోరు బావులు కింద సాగు చేసిన వేరుశనగ పంట కూడా ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. దీంతో ఖరీఫ్‌లో వేరుశనగ చేసేందుకు విత్తన సమస్య వెంటాడుతుంది. పూర్తి స్థాయిలో వేరుశనగ పంట సాగుచేయక పోవడంతో సాగు విస్తీర్ణం కూడా తగ్గుతూ వస్తోంది. పది సంవత్సరాల క్రితం మడకశిర నియోజకవర్గంలో 42 వేల హెక్టార్ల వేరుశనగ పంట సాగు చేసేవారు. వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల కారణంగా పంట దెబ్బతినడం, ప్రతి ఏటా సాగు ఖర్చులు అధికమడుతుండడంతో సాగు విస్తీర్ణం కూడా తగ్గుతోంది. ప్రస్తుతం 30వేల హెక్టార్లలోనే రైతులు ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసేందుకు ప్రభుత్వం సబ్సిడీతో వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేస్తుంది. అర ఎకరా, ఎకరా ఉండే రైతులకు సబ్సిడీతో అందిస్తున్న వేరుశనగ సాగుకు సరిపోతుందని, ఎకరా పైబడి ఉన్న రైతులు మాత్రం మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మార్కెట్‌లో వేరుశనగ ధర కూడా అధకంగా ఉండడం వల్ల ఐదు ఎకరాలు ఉన్న రైతులు రెండు, మూడు ఎకరాలు సాగు చేసి మిగతా పొలాన్ని బీడుగా వదిలేసే పరిస్థితి దాపురించింది. పూర్తి స్థాయిలో వేరుశనగ సాగు చేసేందుకు వీలుగా సబ్సిడీతో పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు. బయటి మార్కెట్‌లో అధికధరకు వేరుశనగను కొనుగోలు చేసి పంటను సాగు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సబ్సిడీ విత్తన వేరుశనగ కోసం ప్రతిపాదనలు

ఖరీఫ్‌లో నియోజకర్గంలో రైతులు వేరుశనగ సాగు చేయడానికి వీలుగా 21,800 క్వింటాళ్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఏటా ఖరీఫ్‌లో నియోజకర్గంలో 30 వేలహెక్టార్లలో వేరుశనగ పంటను సాగు చేస్తారు. మడకశిర మండలానికి 5,500 క్వింటాళ్లు, అమరాపురం మండలానికి 5వేల క్వింటాళ్లు, గుడిబండకు 5,500 క్వింటాళ్లు, రొళ్లకు మూడు వేల క్వింటాళ్లు, అగళి మండలానికి 3,500 క్వింటాళ్ల విత్తన వేరుశనగ అవసరమని ప్రతిపాదనలు పంపించాం.

-తిమ్మప్ప, మండల వ్యవసాయ అధికారి

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆంజనేయస్వామి విగ్రహం, హోమాల్లో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

అమరాపురం, మే 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నడలుడం గ్రామంలో శుక్రవారం ఉదయం బ్రహ్మ ముహూర్తంలో ఆంజనేయస్వామి మూలవిగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆంజనేయస్వామి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ హితేంద్ర, నాగవేణి, శివుడు, చంద్రప్ప, భక్తులు పాల్గొన్నారు.

అక్రమంగా కర్ణాటకకు ఇసుక తరలింపు



ఆంధ్ర నుంచి కర్ణాటకకు ట్రాక్టర్‌లో తరలుతున్న ఇసుక

పరిగి, మే 9(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలు ఇల్లు కట్టుకోవడానికి ఇసుకను ఉచితంగా వాగులు, వంకల నుంచి తరలించుకోవచ్చని ప్రభుత్వం ఆదేశాలిస్తే.. కొందరు నాయకుల పేర్లు చెప్పుకుని పైడేటిలోగల పెన్నా నదిలో నుంచి కర్ణాటక ప్రాంతానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గోరంట్ల, పెనుకొండ, సోమందేపల్లి తదితర దూర ప్రాంతాలకు కూడా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు.

రోడ్డుకు అడ్డంగా ఉన్న కంపచెట్ల తొలగింపు



ఎక్స్‌కవేటర్‌తో కంపచెట్లను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు

మడకశిర రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): మడకశిర- హిందూపురం ప్రధాన రహదారి కల్లుమర్రి చెరువు మలుపుల వద్ద రోడ్డుకు అడ్డంగా వచ్చిన కంపచెట్లను కల్లుమర్రి సర్పంచు గంగమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం తొలగించారు. ఈ నెల 5న ఆంధ్రజ్యోతిలో 'పొంచి ఉన్న ప్రమాదం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ప్రధాన రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నాగరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

మడకశిర రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రమేష్ తెలిపారు. మండలలోని గుర్రపుకొండ, మరియతండాలో కొంత మంది అనారోగ్యంతో ఉండడంతో శుక్రవారం ఆ గ్రామాలకు వెళ్ళి పరిశీలించారు. ఎండలు అధికంగా ఉన్నాయని, ఎక్కువగా బయట తిరగకూడదన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందకుండ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అస్వస్థతతో ఉన్న పలువురి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి నర్సేగౌడ్ గ్రామాలోని డ్రైనేజీలు, వీధులను శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యకార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ దేవి ఉత్సవం

గుడిబండ, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దేహట్టి మారెమ్మ దేవి, గుడిబండ తుమ్మలమారెమ్మ ఆలయంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దిన్నెహట్టి గ్రామానికి చెందిన మా రెమ్మ అమ్మవారిని మారన్న అనే వ్యక్తి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బంధువులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో యోగణ్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో మారెమ్మదేవి